సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 28 । మే । 2023

న్యూస్‌రీల్

భూముల రీసర్వే వేగవంతం

● జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్



సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

కొయ్యూరు: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. భూముల రీసర్వే విధానంపై ఆయన పూర్తిగా అవగాహన కల్పించారు. బూదరాళ్ల పంచాయతీలో సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. పలువురు వీఆర్వోల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. విధులను సక్రమంగా నిర్వహిస్తే నిర్దీత సమయానికి పూర్తిచేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ దిశగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తహసీల్దార్ తిరుమలరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

● ఐటీడీఏ పీవో అభిషేక్



టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: టెన్త్‌లో ఫెయిలైన విద్యార్థులంతా సప్లిమెంటరీ పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంతో ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల తలారిసింగి, శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు అమలుజేస్తున్న ప్రత్యేక బోధన కార్యక్రమాలను శనివారం ఆయన పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సన్నద్ధతను ఆయన పరిశీలించారు. గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు పాల్గొన్నారు.

డీఈడీ మొదటి సెమిస్టర్‌లో వందశాతం ఉత్తీర్ణత

రంపచోడవరం : స్థానిక ఉపాధ్యాయ శిక్షణ కళాశాల 2021–2023 డీఈడీ మొదటి బ్యాచ్ సెమిస్టర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చిన్నబాబు శనివారం తెలిపారు. మొత్తం 36 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 36 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కళాశాల మొదటి ర్యాంక్ కె.వినాయక్, రెండో ర్యాంక్ కె. దీపిక, మూడో ర్యాంక్ కె. కృష్ణారావు సాధించినట్టు తెలిపారు. వీరిని కళాశాల అధ్యాపకులు, పలువురు ప్రముఖులు అభినందించారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు, వెంకటలక్ష్మి, సామ్రాజ్యం, బాపిరాజు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాజవొమ్మంగి: టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల రెండవ తేదీనుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా తెలిపారు. శనివారం ఆయన ఫోన్లో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 24 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 4,168 మంది పరీక్షలు రాయనున్నారని ఆయన వివరించారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. 2న ఫస్ట్ లాంగ్వేజి, 3న సెకండ్ లాంగ్వేజ్, 5న ఇంగ్లీష్ , 6న మ్యాథ్స్, 7వ తేదీన సైన్స్, 8న సోషల్, 9వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ (కంపోజిట్ కోర్సు) ఓఎస్‌ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1, జూన్ 10న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–2 రాయాల్సి ఉంటుందన్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైనట్లు ఆయన తెలిపారు.

గిరి యువతకు ఉపాధి లక్ష్యంగా..

- ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లు
- అనంతగిరి, ముంచంగిపుట్టు, అరకులో ఏర్పాటు
- ఒకొక్క దానిలో ఆరుగురికి అవకాశం
- వచ్చే నెలలో ప్రారంభం
- త్వరలో పాడేరు, కొయ్యూరు ప్రాంతాల్లో ఏర్పాటు



అనంతగిరిలో ఐటీడీఏ ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్

అనంతగిరి: గిరిజన నిరుద్యోగులు ఉపాధి కల్పించాలన్నా లక్ష్యంతో ఐటీడీఏ ముందుకు సాగుతోంది. మరోపక్క వాహనచోదకుల సమస్యను పరిగణనలోకి తీసుకున్న పాడేరు ఐటీడీఏ తన పరిధిలో అనంతగిరి, మంచంగిపుట్టు, అరకు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అరకులో వివిధ కంపెనీలకు చెందిన పెట్రోలు బంక్‌లు ఉన్నప్పటికీ పర్యాటక కేంద్రం కావడంతో పెట్రోల్ వ్యాపారం ఎక్కువగానే ఉంటుంది. దీనిని దృష్టిలోపెట్టుకుని పాడేరు ఐటీడీఏ అరకు– విశాఖ ప్రధానరోడ్డును ఆనుకొని బంక్‌ను ఏర్పాటుచేసింది. వినియోగదారుల సమస్య పరిష్కారం కావడంతోపాటు కొంత మందికి గిరి యువతకు ఉపాధి కలగనుంది.

● అనంతగిరిలో అరకు– విశాఖ ప్రధానరోడ్డును ఆను కొని కొండ ప్రాంతంలో బంక్‌ను నిర్మించింది. వచ్చేనెలలో బంక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

● ప్రస్తుతం మూడు బంక్‌ల్లో ఎలక్ట్రికల్ పనులు జరుగుతున్నాయి. ఎంపిక చేసిన మేనేజర్, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు.

హిందుస్తాన్ పెట్రోలియం సహకారంతో..

పాడేరు ఐటీడీఏ హిందుస్తాన్ పెట్రోలియం సహకారంతో మూడు బంక్‌లను ఏర్పాటుచేస్తోంది. ఇందుకుగాను ఒకొక్క బంక్‌కు రూ. 70 నుంచి రూ.80 లక్షల చొప్పున నిధులు వెచ్చించింది. ఒకొక్క బంక్‌లో ఆరుగురు గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిర్ణయించింది.

పాడేరు, కొయ్యూరులో..

జిల్లాలోని పాడేరు, కొయ్యూరు మండలాల్లో కూడా పెట్రోల్ బంక్‌లు ఏర్పాటుచేయాలన్న నిర్ణయంతో పాడేరు ఐటీడీఏ ఉంది. ఇందుకు సంబంధించిన పనులు వచ్చే నెలలో ప్రారంభం కానున్నాయి.

వచ్చే నెలలో ప్రారంభిస్తాం



గిరి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఐటీ డీఏ కృషిచేస్తోంది. బంక్‌లో పనిచే సేందుకు, గిరిజన నిరుద్యో గుల ఎంపిక పూర్తయింది.వీరంతా ప్రస్తుతం విశాఖపట్నంలో శిక్షణ పొందుతున్నారు. జూన్ మొదటివారంలోని పెట్రోల్ బంక్‌లను అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తున్నాం.

– అభిషేక్, పాడేరు ఐటీడీఏ పీవో

నాణ్యమైన సరకులు సరఫరా చేయండి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని కేజీబీవీ పాఠశాలలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం తన సమావేశ మందిరంలో జిల్లాలోని 19 కేజీబీవీ పాఠశాలలకు నిత్యావసర సరుకుల సరఫరాకు గాను టెండర్ల ద్వారా ధరలను నిర్ణయించారు. టెండరు ప్రక్రియలో పాల్గొన్న ఏజెన్సీలకు జంబ్లింగ్ విధానంలో పాఠశాలలను కేటాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేనెల 12 నాటికి నిత్యావసర సరుకులు, కూరగాయలు, గుడ్లు, పాలు పంపిణీ చేయాలని సూచించారు. సంబంధిత కాంట్రాక్టుదారులకు నిబంధనల ప్రకారం బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. మూడు నెలలకు మాత్రమే ప్రస్తుతం టెండరు ఖరారు చేశామన్నారు. మూడు నెలల అనంతరం మార్కెట్ ధరలను పరిశీలించి తిరిగి మరలా టెండరు నిర్వహిస్తామన్నారు. సరుకుల పంపిణీ పారదర్శకంగా ఉండాలని, నాణ్యమైన సరుకులు పంపిణీ చేస్తే రెండవ సారి సరఫరాకు అవకాశం కల్పిస్తామన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన రెండు రోజుల్లో కేజీబీవీ ప్రత్యేక అధికారులు స్పెషల్ ఆఫీసర్లు బిల్లులు సమర్పించాలని, అందుబాటులో ఉన్న నిధులను పరిశీలించి వేగంగా బిల్లులు చెల్లిస్తామన్నారు. మిరియాలకు సంబంధించి స్థానిక గిరిజన రైతుల నుంచి కిలో రూ.525 లకు కొనుగోలు చేసి,కేజీబీవీలకు సరఫరా చేస్తే ఆమేరకు బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. కాఫీ, మిరియాలు సాగు చేస్తున్న రైతులను ప్రోత్సహించి గిట్టుబాటు ధరలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో సలీంబాషా, పౌర సరఫరాల శాఖ డీఎం బి.గణేష్, విశాఖ సూపర్ బజారు లిమిటెడ్, పీవీఆర్ ట్రేడర్స్, క్లాసిక్ ఎంటర్‌ప్రైజెస్, డీసీఎంఎస్ విజయనగరం, వినాయక ఎంటర్‌ప్రైజెస్, ఎస్‌సీఎఫ్ వైజాగ్ తదితర ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అరుణాచలం యాత్రకు ప్రత్యేక బస్సు సర్వీసు

● గోకవరం డిపో మేనేజర్ రామన్నదొర

గంగవరం : ఏపీఎస్ ఆర్టీసీ గోకవరం డిపో నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక పుణ్యక్షేత్ర యాత్ర స్పెషల్ బస్సు సర్వీసును ఏర్పాటు చేసినట్లు గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ రామన్నదొర తెలిపారు. పౌర్ణమి రోజున అరుణాచల గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తులకు జూన్ రెండో తేదీ ఉదయం 8 గంటలకు గోకవరం నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసును ఏర్పాటుచేశామని ఆయన వివరించారు. అరుణాచల గిరి ప్రదర్శన, దర్శనం, కంచి, శ్రీకాళహస్తి, విజయవాడ కనక దుర్గ అమ్మవారి దర్శనాల అనంతరం సురక్షితంగా గమ్యస్థానానికి చేరుస్తామన్నారు. అరుణాచలం యాత్ర రానుపోను బస్సు టికెట్ ధర ఒకొక్కరికి రూ.3200 నిర్ణయించినట్టు ఆయన పేర్కొన్నారు. వచ్చేనెల రెండు నుంచి ఆరో తేదీ వరకు యాత్ర జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 7382910258, 7729895566 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కారం



గంగవరంలో వలంటీర్లకు సేవా రత్న అవార్డులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



వై.రామవరంలో అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ ఫలాలను గడప గడపకు చేరవేయడంలో గ్రామవలంటీర్లు అందించిన సేవలు అభినందనీయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 153 మందికి సేవా మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం సత్కరించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయం, గ్రామవలంటీర్ వ్యవస్థ కరోనా వంటి కష్టకాలంలో గ్రామాల్లో ఎంతో సమర్థవంతంగా పనిచేసిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చే విధంగా వలంటీర్లు పనిచేయాలన్నారు. ఇచ్చే గౌరవవేతనంతో పాటు సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించడం జరుగుతుందన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించడంలో, వారికి పథకాలు అందించడంలో విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. సేవామిత్ర పురస్కారాలు పొందిన వారిలో కారం సంకురుదొర (కొత్తాడ), శారపు శీనుబాబు(సూరంపాలెం), యాట్ల శ్రీనివాసరెడ్డి (మర్రిపాలెం), దుమ్ములరాజు(నెల్లిపూడి), చవలం శేషమ్మ(గంగవరం) ఉన్నారని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, వైస్ ఎంపీపీలు కుంజం గంగాదేవి, కొటికలపూడి రామతులసి, కోఆప్షన్ సభ్యుడు కేఎస్.ప్రభాకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు, నెల్లిపూడి ఎంపీటీసీ పెబ్బిలి కనకలక్ష్మి, సర్పంచులు కలుముల అక్కమ్మ, కుంజం లక్ష్మి, కామరాజు దొర, పాతర రమణమ్మ, కురుసం అక్కమ్మ, మండల పరిషత్ పరిపాలనాధికారి సిద్ధేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి సీహెచ్ రఘునాథ్ పాల్గొన్నారు.

వై.రామవరం: మండల ప్రజలకు మరిన్ని ఉత్తమ సేవలు అందించి జగనన్న ప్రభుత్వా నికి మంచి పేరు తీసుకురావాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కోరారు. వై.రామవరం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన శనివారం గ్రామవలంటీర్లకు పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ, గ్రామ వలంటీరు వ్యవస్థ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. వలంటీరు వ్యవస్థ వల్ల ప్రతీ ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మండలంలో ఉత్తమ సేవలు అందించిన ఐదుగురు గ్రామ వలంటీర్లకు సేవారత్న, 143 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులను ఆమె అందజేశారు. దీనిలో భాగంగా వలంటీర్లను సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి, అవార్డులు ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం వారు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆదేశం
- యూ. చీడిపాలెం పీహెచ్‌సీ సందర్శన



వాహనంలో వచ్చిన మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

కొయ్యూరు: ఎపిడమిక్ సమయంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ జమాల్ బాషా ఆదేశించారు. శనివారం ఆయన మారుమూల యూ.చీడిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అదే సమయంలో వాహనంలో వచ్చిన మందులను పరిశీలించారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన రోగులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడవచ్చన్నారు. వైద్యాధికారులు జయప్రకాష్, ఎల్‌టీ సత్తిబాబు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై రాజకీయం తగదు

- తప్పుడు ఆరోపణలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి
- ప్రజల నుంచి గుణపాఠం తప్పదు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హెచ్చరిక



ఆక్రమణ తొలగింపులో పాల్గొన్న వందేమాతరం శ్రీనివాస్ ఫొటోలను చూపిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపును రాజకీయం చేస్తూ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ధ్వజమెత్తారు. శనివారం పాడేరులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడేరు ప్రాంతంలో రోడ్లు అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తుందన్నారు. అయినప్పటికీ ఆక్రమణల తొలగింపులో చిరు వ్యాపారులు ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. వర్తక సంఘం నేతలతో కలిసి శుక్రవారం సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో సమావేశమయ్యామన్నారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించేందుకు కలెక్టర్ మూడు రోజులు గడువు ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. రోడ్డున పడిన చిరు వ్యాపారులకు తగిన సాయం చేసేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి రాజకీయ దురుద్దేశంతో అంటగట్టడం భావ్యం కాదన్నారు. తమ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆమె దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మారుమూల గ్రామాల్లో నిర్వహించడం వల్ల ఆక్రమణల తొలగింపు సమాచారం తనకు అందలేదన్నారు. అయితే పాడేరులోని అన్ని వర్గాల వ్యాపారులు తన భర్త డాక్టర్ నర్సింగరావును కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారని, వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అధికారం లేక, నలుగురి పలకరింపునకు నోచుకోని ఈశ్వరి తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకునే రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆమెకు త్వరలో ప్రజల నుంచి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వందేమాతరం శ్రీనివాస్‌పై ఫిర్యాదు

విద్యాశాఖలో పనిచేస్తున్న వందేమాతరం శ్రీనివాస్, పలువురు ఉద్యోగులపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్నట్టు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. రెండు రోజులుగా రెవెన్యూ, పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగించే పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగి వందేమాతరం శ్రీను, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు అనవసరమైనప్పటికీ, దగ్గర ఉండి దుకాణాలను కొట్టించి కుట్రపూరితంగా వ్యవహరించారన్నారు. దీనిపై తగిన ఆధారాలతో వారిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నామని ఆమె తెలిపారు. వందేమాతరం శ్రీనివాస్.. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, టీడీపీ నేత గోవింద మాస్టారుకు ప్రధాన అనుచరుడని, ఆయన టీడీపీ కార్యకర్త అనే విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. అలాగే రెవెన్యూ, పోలీసు అధికారులు ఆక్రమణల తొలగింపులో చేపట్టిన ముందస్తు చర్యలు, అసలైన బాధితులకు అందించే సహాయక చర్యలపై సమగ్ర వివరాలను కలెక్టర్ దృష్టికి లేఖ ద్వారా తీసుకువెళ్తామన్నారు.

ఆర్టీసీ భూములకు రెట్టింపు బిడ్డు

పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని భూములకు టీడీపీ నేతలు రెట్టింపు ధరలతో బిడ్డు వేశారని, టీడీపీ సానుభూతిపరుడు కిల్లు రమేష్‌నాయుడు, టీడీపీ నేత గోవిందుమాస్టారు కుట్రపూరితంగా వ్యవహరించారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆరోపించారు. గోవిందు మాస్టారు అనుచరుడైన కొయ్యూరు మండలానికి చెందిన ఓ వ్యక్తితో పాటు, రమేష్‌నాయుడు అనుచరులు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ స్థలాలను అధిక బిడ్డు ధరతో కాజేసి అక్రమ సంపాదనకు కుట్రపన్నుతున్నారన్నారు. ప్రజలంతా వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలను హరించే చర్యలకు పాల్పడితే తాను చూస్తూ ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వినియోగంలోకి రైతుబజార్

● ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



రైతుబజార్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, అధికారులు

సాక్షి,పాడేరు: పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంటర్‌లోని రైతు బజారును వినియోగంలోకి తీసుకురావాలని ఇన్‌చార్జి సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. రైతు బజారు, ఆర్‌అండ్‌బీ నివాస సముదాయంలో ఉన్న ఖాళీ స్థలాన్ని రెవెన్యూ అధికారులు, ఎంపీడీవో, సచివాలయ సిబ్బందితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. చిరు వ్యాపారులకు మార్కెట్ సదుపాయాలు కల్పించడానికి అనుకూలతలపై సమగ్ర నివేదిక తనకు అందజేయాలని సూచించారు. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేయడానికి సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.త్రినాథరావు నాయుడు, ఎంపీడీవో, పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ గిడ్డంగి తనిఖీ

సాక్షి,పాడేరు: ఐటీడీఏ ఆధీనంలో నడుస్తున్న ఇండేన్ గ్యాస్ గిడ్డంగిని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత గ్యాస్ స్టాక్ వివరాలు, సిలిండర్ ధరలు, కమర్షియల్ గ్యాస్ బండల వివరాలు, వాటి అమ్మకం ధరలపై ఆయన సమీక్షించారు. సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. గ్యాస్ గిడ్డంగి మరమ్మతులకు అవసరమైన నిధులపై తనకు నివేదిక ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను పీవో ఆదేశించారు.

గిరిజనుడి హత్యకేసులో భార్యాభర్తల అరెస్టు

● వివాహేతర సంబంధమే హత్యకు కారణం
● వివరాలు వెల్లడించిన పోలీసులు

గూడెంకొత్తవీధి : మండలంలోని జర్రెల పంచాయతీ కొండకించంగిలో ఈనెల 24న జరిగిన గిరిజనుడి హత్య కేసుకు సంబంధించి నిందితులైన భార్యాభర్తలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ అశోక్‌కుమార్ వివరించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్టు తమ విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

ఎస్పీ తుహిన్ సిన్హా, చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలను అనుసరించి హత్య కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని విచారణ వేగవంతం చేశామన్నారు. కొండకించంగి గ్రామానికి చెందిన పూజారి మల్లన్న, పూజారి అనూష భార్యాభర్తలు. భర్త మల్లన్న తనను సరిగ్గా పట్టించుకోకపోవడంతో అనూష తన పక్కింటిలో ఉంటున్న అదే గ్రామానికి చెందిన గెమ్మెలి



గిరిజనుడి హత్య కేసులో నిందితులతో సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి, పోలీసులు

చిన్నారావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఇది కొనసాగుతున్న క్రమంలోనే చిన్నారావు కొండపల్లి గ్రామానికి చెందిన ఒక యువతిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆ యువతిని చిన్నారావు పెళ్లి చేసుకుంటే తనకెక్కడ దూరం అవుతాడో అన్న అక్కసుతో అనూష పదే పదే చిన్నారావుతో గొడవపడేది. నువ్వు ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటే మీ ఇద్దరినీ చంపేస్తానని బెదిరించేది. ఈ క్రమంలోనే ఈనెల 24న అనూష చిన్నారావుతో వాగ్వాదానికి దిగింది. అతనిపై చేయి చేసుకోవడంతో ఆవేశంలో చిన్నారావు ఆమె జుత్తుపట్టుకున్నాడు. అదే సమయానికి అనూష భర్త మల్లన్న అక్కడకు రావడంతో ఉన్నట్టుండి కథ మార్చి అసలు విషయం దాచి చిన్నారావు తనను శారీరకంగా లోబరుచుకోవాలని ప్రయత్నిస్తున్నాడని ఇందుకు తాను నిరాకరించడంతో తనపై దాడి చేస్తున్నాడని భర్తతో చెప్పింది.

దీంతో కోపోద్రిక్తుడైన మల్లన్న ఆవేశంతో కత్తితో చిన్నారావు మెడపై దాడి చేశాడు. ఈ ఘటనలో చిన్నారావు మరణించాడు. ఈ కేసుకు సంబంధించి విచారణలో చిన్నారావు హత్యకు కారకులైన భార్యాభర్తలను అరెస్టు చేశామని, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. వీరిద్దరూ గ్రామం నుంచి తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకుని, కోర్టులో హాజరుపరిచినట్టు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ అప్పలసూరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే వేగవంతం

రంపచోడవరం: ఏజెన్సీలో వైఎస్సార్ భూహక్కు, భూరక్ష ప్రోగ్రాం ద్వారా భూముల రీ సర్వే వేగవంతం చేయాలని సర్వే రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ పి.కె.జయకుమారి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్‌లో ఏడు మండలాలకు సంబంధించిన మండల, సచివాలయ సర్వేయర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో ప్రభుత్వ, ప్రైవేట్ భూముల రికార్డులు పక్కాగా పరిశీలించి రైతులకు నష్టం లేకుండా సర్వే చేయాలన్నారు. రీసర్వే కోసం సంబంధిత గ్రామాల్లో సభలు నిర్వహించాలని, సర్వేయర్లు తమ లక్ష్యాలకనుగుణంగా నిబంధనల మేరకు వంద రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అధికారులు పనులను తరచూ పర్యవేక్షించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్వే రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ జయకుమారి

ప్రభుత్వ, ప్రైవేట్ భూములకు సర్వే చేసి, హద్దులకు మార్కులు పెట్టాలన్నారు. జాయింట్ డైరెక్టర్ సీహెచ్.వి.ఎస్.ఎన్.కుమార్, జిల్లా సర్వే భూ రికార్డుల అధికారి వై.మోహనరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి



దొయితరి మృతదేహం

డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజెరు వాకపల్లి గ్రామానికి చెందిన పాంగి దొయితరి(14) పాముకాటుతో మృతి చెందాడు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటు వేయడంతో కుటుంబ సభ్యులు గుర్తించి, హుటాహుటిన అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. సకాలంలో వైద్యం అందక తమ కొడుకు మృతి చెందినట్టు తల్లిదండ్రులు బోయితే, అర్జున్ ఆరోపించారు. మృతుడు దోయితరి హుకుంపేట మండలం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్టు తెలిపారు.

గిరిగ్రామాల్లో అభివృద్ధి బాటలు



చింతగరువు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా



అమృత జలధార కార్యక్రమంలో గిరిజన మహిళకు బిందెతో నీరు అందిస్తున్న ఎస్పీ

● మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో ఎస్పీ తుహిన్‌సిన్హా పర్యటన
● చింతగరువు గ్రామంలో అమృత జలధార కార్యక్రమం ప్రారంభం

పెదబయలు: జిల్లాలోని మారుమూల ప్రజలు ఇప్పుడు అభివృద్ధిని కోరుకుంటున్నారని పోలీసు మైత్రితోనే కుగ్రామాల అభివృద్ధికి బాటలు పడతాయని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు.

పెదబయలు మండలం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం గిన్నెలకోట పంచాయతీ చింతగరువు గ్రామంలో ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం పర్యటించారు. జిల్లా పోలీసు ఆర్థిక సాయంతో గ్రామంలో చేపట్టిన అమృత జలధార కార్యక్రమంలో భాగంగా తాగునీటి పథకాన్ని ఎస్పీ ప్రారంభించారు. గ్రామస్తులకు బిందెల ద్వారా నీటి పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ప్రజలు పోలీసులతో సత్సంబంధాలు మెరుగుపర్చుకోవాలని, సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. జిల్లాలో మారుమూల గ్రామాల్లో పోలీసు శాఖ మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. అమాయక గిరిజనులే లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అభివృద్ధిని అడ్డుకోవడం ప్రభుత్వ ఫలాలకు గిరిజనులు దూరమయ్యారన్నారు. ప్రస్తుతం గిరిజనులు తమ ప్రాంతాల అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమాన్ని కోరుతున్నారన్నారు.

ఇంజరి, గిన్నెలకోట, జామిగుడ పంచాయతీలకు తారురోడ్డు నిర్మాణం జరుగుతుందని రవాణా సదుపాయం మెరుగుపడిందన్నారు. అన్ని గ్రామాలకు తాగునీరు, విద్య, వైద్యం మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తున్నామన్నారు. గిరిజన రైతులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో సిల్వర్ ఓక్ మొక్కల పంపిణీ, విత్తనాల పంపిణీ చేస్తున్నామన్నారు.

గంజాయి సాగుకు దూరం అభినందనీయం

మారుమూల గ్రామాల్లో గతంలో గంజాయి సాగు చేసే వారని, ఇప్పుడు సాగుకు దూరంగా ఉన్నారని, ఆయన అభినందించారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలన్నారు. గుల్లేలు నుంచి కోంద్రుం వరకు తారురోడ్డు మద్దిగరువు నుంచి కోంద్రుం వరకు తారురోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. చింతగరువు గ్రామానికి వచ్చిన ఎస్పీ తుహిన్ సిన్హాకు గిరిజనులు పూలమాలలు సత్కరించారు. గ్రామంలో పోలీసు శాఖ తరపున ఏర్పాటుచేసి భోజనం ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్, జి.మాడుగుల సీఐ ఎ.సత్యనారాయణ, పెదబయలు, ముంచంగిపుట్టు ఎస్ఐలు పి.మనోజ్‌కుమార్, రవీంద్ర, గిన్నెలకోట సర్పంచ్ సాగేని శ్రీను పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో 2023–2024 సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అంజనేయులు తెలిపారు. పదోవ తరగతి ఉత్తీర్ణత అయిన ఎస్టీ విద్యార్థులు ఈ నెల 31 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులకు కూడా ప్రతి గ్రూపులో ఒక సీటు చొప్పున కేటాయిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.